# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు ప్రకటించింది.
- నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఈరోజు ఉదయం భారీ భూకంపం సంభవించింది.
- అంతర్జాతీయ దర్యాప్తులను భారత్ పోల్ వేగవంతం చేస్తుందని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- హెచ్ఎంపీవీ పట్ల ప్రజలకు ఎలాంటి ఆందోళన అవసరంలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ స్పష్టం చేశారు.

=========================

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు ప్రకటించింది. 70 శాసనసభ స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఒకే విడతలో ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తామని ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ ఈరోజు న్యూ ఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఈవీఎం ట్యాంపరింగ్, ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఆయన స్పందిస్తూ.. ఈవీఎంలను హ్యాక్ చేసే అవకాశం లేదని న్యాయస్థానాలు ఇప్పటికే 42 సార్లు తీర్పులు చెప్పాయని గుర్తు చేశారు. ఓటరు జాబితాలో పేర్ల చేరిక, తొలగింపులకు సంబంధించి విధివిధానాలను పాటిస్తున్నామని వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=========================

నేపాల్ - టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఈరోజు ఉదయం భూకంపం సంభవించింది. ఈ భూకంపం కారణంగా ఇప్పటివరకూ 95 మంది మరణించగా.. 130 మంది గాయపడ్డారు. నేపాల్ సరిహద్దుల వద్ద టిబెట్ లోని జిజాంగ్‌లో సంబవించిన ఈ భూకంపం రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదైంది. బీహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం సహా ఉత్తర

భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో కూడా ఈ భూకంపం ప్రకంపనలు సృష్టించింది. బీహార్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనలు బలంగా కనిపించాయి. ప్రజలు భయాందోళనలతో తమ ఇళ్ల నుండి బయటకు పరుగులు తీశారు.

=======================

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) అభివృద్ధి చేసిన భారత్ పోల్ పోర్టల్‌ను కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలతో సహా అంతర్జాతీయ నేరాలను ఎదుర్కోవడానికి ఈ పోర్టల్ ను అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. అంతర్జాతీయ దర్యాప్తును భారత్ పోల్ పోర్టల్ మరింత సులభతరం చేయనుందన్నారు. అవసరమైన సమాచారాన్ని పొందడానికి ఇప్పుడు దర్యాప్తు సంస్థలు ఇంటర్‌పోల్‌తో అనుసంధానమవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, ఆయుధాల స్మగ్లింగ్, ఉగ్రవాద సంబంధిత నేరాలు, మానవ అక్రమ రవాణాకు సంబంధించిన కేసులను పరిష్కరించడంలో ఈ పోర్టల్ సహాయపడుతుందని అమిత్ షా మాట్లాడుతూ...

(వాయిస్ 33 సెకన్లు)

=======================

కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈరోజు న్యూఢిల్లీలోని భారత మండపంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన రవాణా మంత్రుల సమావేశానికి అధ్యక్షత వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడానికి, కీలకమైన విధానపరమైన విషయాలపై సహకార చర్చలను సులభతరం చేయడానికి ఈ వార్షిక సమావేశం ఉపకరిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రాంతీయ సవాళ్లను పరిష్కరించడానికి దేశవ్యాప్తంగా పరివర్తన రవాణా విధానాలను ఒకే విధంగా అమలు చేయడానికి ఇటువంటి చర్చలు చాలా అవసరమన్నారు.

=======================

నూతన సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ అధికారిక క్యాలెండర్‌ను కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు న్యూ ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఆవిష్కరించారు. "సబ్ కా సాత్.. సబ్ కా వికాస్" సూత్రాన్ని నూతన క్యాలెండర్ ప్రతిబింబిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విరామం

=======================

హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) పట్ల ప్రజలకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ స్పష్టం చేశారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వైద్యాధికారులతో ఈరోజు శ్వాసకోశ వ్యాధుల ప్రస్తుత పరిస్థితి పై దృశ్యమాధ్యమ విధానంలో సమీక్షించారు. ఇన్ ఫ్లుఎంజా, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌లపై నిఘాను బలోపేతం చేసి సమీక్షించాలని ఈ సందర్భంగా ఆమె రాష్ట్రాలకు సూచించారు. శ్వాసకోశ వ్యాధుల పెరుగుదల సాధారణంగా శీతాకాలంలోనే కనిపిస్తుందని ఆమె పునరుద్ఘాటించారు.

=======================

ప్రవాస భారతీయ సమాజం.. వికసిత్ భారత లక్ష్య సాధనలో చాలా ముఖ్య పాత్ర పోషిస్తుందని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్ చటర్జీ పేర్కొన్నారు. ఈ రోజు ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించి 18వ ప్రవాస భారతీయ దివాస్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈ నెల 9వ తేదీన ఒడిస్సాలోని

భువనేశ్వర్‌లో 18వ ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యమానికి ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టీన్ కంగలూ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వివరిస్తూ....

(వాయిస్ 34 సెకన్ల)

ఇదిలా ఉండగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రేపు ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్టణంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలోని 2 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

========================

మహాకుంభమేళా సందర్శించే యాత్రికుల భద్రత కోసం ప్రభుత్వం అత్యాధునికపరమైన ఏర్పాట్లు చేస్తోంది. యాత్రికులను రక్షించేందుకు రిమోట్ కంట్రోల్డ్ లైఫ్ సేవింగ్ పరికరాలను ఏర్పాటు చేశారు. ఇవి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రదేశానికి తీసుకువెళ్లడంలో సహాయపడతాయి. కాగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ లో ఈ నెల 13 నుండి మహాకుంభమేళా ప్రారంభం కానుంది.

========================

రాబోయే తరాల భవిష్యత్తును నిర్దేశించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈరోజు ఆగ్రాలో జరిగిన ఉత్తరప్రదేశ్ పాధమికోన్నత ఉపాధ్యాయుల అసోసియేషన్ 57వ సదస్సును ప్రారంభించారు. విచక్షణతో సరైన ఎంపికను ఎంచుకునే సామర్థ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా రక్షణ మంత్రి ప్రసంగిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

========================

హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలలో రేపు తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. బీహార్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో రేపు తెల్లవారుజామున దట్టమైన పొగమంచు పరిస్థితులు కొనసాగుతాయని IMD అంచనా వేసింది. ఆదే విదంగా రాబోయే 2 రోజుల్లో వాయువ్య, తూర్పు భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉందని, ఈశాన్య రాష్ట్రాల్లో రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

========================

కౌలాలంపూర్‌లో జరుగుతున్న మలేషియా సూపర్ 1000 టోర్నమెంట్ భాగంగా ఈరోజు జరిగిన వరుస మ్యాచ్ లలో భారత మహిళల జోడీ ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ థాయ్‌లాండ్‌కు చెందిన ఓర్నిచా జోంగ్ సతపోర్న్‌పర్న్, సుకిట్టా సువాచాయ్‌లను ఓడించి తదుపరి రౌండ్ లోకి ప్రవేశించారు.

========================
========================